ఎన్నికల తనిఖీలు ముమ్మరం

నగదు బట్వాడా నిరోధక చర్యలు ● ఈసీ సత్యప్రదసాహు

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓటర్లకు నగదు బట్వాడా చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారంటూ సమాచారం అందడంతో వాహనాల తనిఖీలను ఫ్లయింగ్ స్క్వాడ్ తీవ్రతరం చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే రెండు వారాలు అత్యంత కీలకమైనవని, ఓటర్లను నగదు, కానుకల ద్వారా మభ్యపెట్టేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తారని, ఈ నేపథ్యంలో ఆదాయపు పన్నుల శాఖ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు కూడా చర్యలు చేపట్టాలని ఆయన ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు సచివాలయంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు, ఐటీ, ఈడీ అధికారుల, జీఎస్టీ, కస్టమ్స్ శాఖ అధికారుల సమావేశం ఈసీ సత్యప్రదసాహు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.109 కోట్లకు



వివిధ శాఖాధికారుల సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు

పైగా నగదు, నగలు తదితర వస్తువులు పట్టుబడ్డాయని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఒకే ప్రాంతం వద్ద నిఘా వేయకుండా పలు చోట్ల నిఘా వేసి వాహనాల తనిఖీలు జరపాలని ఆయన ఆదేశించారు. సీవిజిల్ యాప్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తేలికగా తీసుకోకూడదని, తక్షణం చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజల ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఆ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖుల వాహనాలను తప్పకుండా తనిఖీ చేయాలని, అభ్యర్థుల వాహనాలపై కూడా తీవ్ర నిఘా వేయాలని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ఈ నెల 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్, ఐటీ, ఈడీ తనిఖీలు కూడా ముమ్మరంగా జరపాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సత్యప్రద సాహు తెలిపారు.

కోవైలో...

అడయార్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఓటర్లకు నగదు, బహుమతులు పంపిణీ చేయకుండా అడ్డుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుంది. ఈ తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతోంది. ఈ క్రమంలో కోయంబత్తూరు లోక్‌సభ స్థానం పరిధిలో రూ.3.57 కోట్ల నగదును, 634 చీరలను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి గత నెల 31వ తేదీ వరకు రూ.3,57,64,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో తగిన ఆధారాలు చూపించి రూ.1,59,37,150ని యజమానులకు అప్పగించారు. అలాగే, 634 చీరలు, 200 మద్యం బాటిళ్ళను కూడా ప్రత్యేక బృందం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

16.7 కిలోల నగలు స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 2: విరుదునగర్‌లో తగిన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న 16.7 కిలోల నగలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మదురై నుంచి మూడు కొరియర్ వాహనాల ద్వారా ఈ నగలు తీసుకెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. నాగర్‌కోయిల్, మార్తాండం, శివకాశి, రాజపాళయం ప్రాంతాల్లోని నగల దుకాణాలు అందజేసేందుకు వీటిని తీసుకెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసినా, తగిన ఆధారాలు లేకపోవడంతో 16.7 కిలోల నగలు స్వాధీనం చేసుకొని ట్రెజరీలో అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

సినీ దర్శకుడు అమీర్‌ను విచారించిన ఎన్‌సీబీ



అడయార్, ఏప్రిల్ 2: రూ.2 వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళ సినీ దర్శకుడు అమీర్ మంగళవారం ఢిల్లీలోని ఎన్.సి.బి (నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో) అధికారుల ఎదుట హాజరయ్యారు. ఆయనతో పాటు నగరానికి చెందిన మరో ఇద్దరు పారిశ్రామికవేత్తలు కూడా ఈ విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో అరెస్టయిన సినీ నిర్మాత జాఫర్ సాధిక్‌తో అమీర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సంచలన విషయాలు వెల్లడించినట్లు సమాచారం. ఆయన వాంగ్మూలాన్ని ఆధారంగా చేసుకుని అమీర్‌ను విచారించేందుకు నిర్ణయించిన ఎన్‌సీబీ అధికారులు ఇటీవల సమన్లు జారీ చేసి, 2వ తేదీన విచారణకు రావాలని ఆదేశించారు. దీంతో అమీర్ మంగళవారం ఢిల్లీలోని ఎన్‌సీబీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఎన్‌సీబీ అధికారుల బృందం ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు సమాచారం. ముఖ్యంగా జాఫర్ సాధిక్ డ్రగ్స్ అక్రమ రవాణా చేసే అంశం? ఆయన ఎలా పరిచయమయ్యారు? కోట్లాది రూపాయల పెట్టుబడితో సినిమాలు నిర్మించే స్థాయికి జాఫర్‌సాధిక్ ఎలా ఎదిగారు? ఆయన ఆదాయ వనరులు ఏమిటి? జాఫర్ ప్రారంభించిన రెస్టారెంట్ వ్యాపారంలో భాగస్వామిగా ఎలా చేరారు? తదితర అంశాలపై అమీర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ ప్రశ్నలన్నింటికీ అమీర్ ఓపిగ్గా సమాధానం చెప్పినట్టు తెలిసింది.

ప్రత్యేక నిధిగా చెన్నైకి రూ.5వేల కోట్లిచ్చాం!

● కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్


వికసిత్‌భారత్ ప్రత్యేక సమావేశంలో ప్రసంగిస్తున్న నిర్మలాసీతారామన్

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగరానికి ప్రత్యేక నిధిగా కేంద్రం నుంచి రూ.5వేల కోట్ల మేరకు నిధులిచ్చామని, ఆ నిధుల ఖర్చులకు సంబంధించిన లెక్కలు తేల్చాల్సిన బాధ్యత డీఎంకే ప్రభుత్వానిదేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పల్లావరంలోని ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికల కోసం కచ్చాదీవి వివాదాన్ని తెచ్చినట్లు బీజేపీపై డీఎంకే తప్పుడు ఆరోపణలు చేస్తోందన్నారు. మాజీ ప్రధాని నెహ్రూ కచ్చాదీవిని తలనొప్పి పుట్టించే సమస్యగా పేర్కొన్నారని చెప్పారు. ఇదేవిధంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కచ్చాదీవిని ఓ బండరాళ్లగుట్టగా చెప్పారని తెలిపారు. కచ్చాదీవిని ధారాదత్తంచేసి, డీఎంకే కాంగ్రెస్ పార్టీలు తమిళ ప్రజలకు తీరని ద్రోహం చేశాయన్నారు. ఇక రాష్ట్రంలో వరదలు వచ్చిన వెంటనే కేంద్రం రూ.900 కోట్ల మేరకు నిధులు విడుదల చేసిందని ఆ నిధులను డీఎంకే ప్రభుత్వం ఎలా ఖర్చుపెట్టిందన్న వివరాలను కూడా ప్రకటించాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అడ్డూ అదుపులేకుండా సాగుతోందన్నారు. రామేశ్వరంలో మాదక ద్రవ్యాలు పట్టుబడినా అదంతా గుజరాత్‌లో పట్టుబడినవంటూ రాష్ట్రప్రభుత్వం అసత్యాలు చెబుతోందని నిర్మలా సీతారామన్ చెప్పుకొచ్చారు.

ఈరోడ్‌లో 41 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

పెరంబూర్, ఏప్రిల్ 2: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం 14 ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అధికంగా ఈరోడ్‌లో 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కరూర్ పరమత్తిలో 40.5 డిగ్రీలు, సేలం, వేలూరు, ధర్మపురిలో 40 డిగ్రీలు తిరుచ్చిలో 39.4 డిగ్రీలు, కోవై, మదురై విమానాశ్రయం, తిరుత్తణిలో 38.8 డిగ్రీలు, తిరుపత్తూర్‌లో 38.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నుంచి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.



రంజాన్ వేళలు

బుధవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.28
గురువారం : సహర్ : ఉదయం - 4.21



ఓటుకు నోటు నిరోధం దిశగా చెన్నైలో 5 చోట్ల ఐటీ దాడులు



ఓట్టేరిలో ఐటీ అధికారులు దాడులు జరిపిన భవన సముదాయం

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓటర్లకు నోట్లు పంచేందుకు పలు చోట్ల లక్షలాది రూపాయలు దాచి పెట్టినట్లు తమకు సమాచారం అందిందని ఎన్నికల సంఘం చేసిన ఫిర్యాదు మేరకు ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. నగరంలోని ఐదు ప్రాంతాల్లో ఒకే సమయంలో ఆకస్మిక దాడులు జరిపారు. ఓట్టేరిలో బహుళ అంతస్థుల భవన సముదాయంలో నివసిస్తున్న ఓ కాంట్రాక్టర్ నివాసంలో ఐటీ అధికారులు సోదాలు జరిపారు. పది మందికి పైగా ఐటీ అధికారులు వెళ్ళి ఈ దాడులు చేశారు. ఆ ఇంట్లో రహస్య గదుల్లో నగదు దాచి పెట్టి ఉంటారనే అనుమానంతో ముమ్మరంగా తనిఖీలు జరిపారు. ఇదే విధంగా కొండితోప్పు ప్రాంతంలో ఉత్తరాదికి చెందిన పారిశ్రామికవేత్త ఇంట్లో కూడా తనిఖీ చేశారు. వీరిరువురూ ఎలక్ట్రానిక్ వస్తువులను టోకుగా పంపిణీ చేసే పనుల కాంట్రాక్టర్లుగా ఉన్నారని ఐటీ అధికారుల తనిఖీలో వెల్లడైంది. ఇదే రీతిలో పురుషవాక్కంలోని మూడు చోట్ల ప్రముఖ పారిశ్రామికవేత్తల నివాస గృహాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు జరిపారు.

రాజకీయ నేతల ఇళ్లల్లో...

ఇదిలా ఉండగా ఐటీ అధికారులు రాజకీయ ప్రముఖుల ఇళ్లలోనూ సోదాలు జరిపారు. ఆ మేరకు తిరుప్పూరు పూమలూరుకు చెందిన డీఎంకే నాయకుడి ఇంట్లో కోయంబత్తూరుకు చెందిన ఆదాయ పన్నుల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉడుమలైపేట సమీపం ఆనికడవు ప్రాంతానికి చెందిన డీఎంకే నాయకుడి ఇంట్లో కూడా ఎనిమిది మంది ఐటీ శాఖ అధికారులు ఆకస్మిక సోదాలు జరిపారు. సుమారు ఆరుగంటలపాటు ఈ తనిఖీలు కొనసాగాయి.

9న ప్రధాని మోదీ రోడ్‌షో

● పనగల్ పార్కు నుంచి తేనాంపేట సిగ్నల్ వరకు
● 12న బహిరంగ సభ



అడయార్, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 19న రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. దీంతో అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించి, క్షేత్రస్థాయిలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ నెల 9న రాజధాని చెన్నై మహానగరంలో ఆయన రోడ్‌షో నిర్వహిస్తారు. స్థానిక టి.నగర్‌లోని పనగల్ పార్క్ నుంచి తేనాంపేట సిగ్నల్ వరకు సాగుతుంది. అలాగే, ఈ నెల 12న ప్రధాని మోదీ మరోమారు రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆ రోజున ధర్మపురిలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. ఇందుకోసం రాష్ట్ర బీజేపీ నేతలు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాయి. ముఖ్యంగా, చెన్నైలో జరిగే రోడ్ షోను చరిత్రలో మిగిలిపోయే విధంగా నిర్వహించాలని వారు ఏర్పాట్లు చేస్తున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలో డీఎండీకే, పీఎంకే, మరికొన్ని చిన్నాచితక పార్టీలు కలిసి 39 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. పైగా ఈ ఎన్నికల్లో కనీసం నాలుగు నుంచి ఐదు ఎంపీ సీట్లను బీజేపీ స్వతహాగా గెలుచుకోవాలన్న పట్టుదలతో కమలనాథులు ఉన్నారు. అందుకే ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందు నుంచే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలు ప్రత్యేక దృష్టిసారించి పలుమార్లు పర్యటించారు. ఇపుడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలోని 39 లోక్‌సభ, పుదుచ్చేరిలోని ఒకేఒక్క ఎంపీ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ జరగనుంది. దీంతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు మరోమారు రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ నెల 9, 12 తేదీల్లో ప్రధాని రాష్ట్ర పర్యటనకు వస్తే, ఈ నెల 5వ తేదీన హోం మంత్రి అమిత్ షా రాష్ట్రానికి రానున్నారు. 5వ తేదీన రామనాథపురం, తేని, చెన్నైలలో జరిగే బహిరంగ సభల్లో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. అలాగే, పలువురు బీజేపీ జాతీయ నేతలు సైతం రాష్ట్రానికి రానున్నారు.

భవిష్యత్తులో ఆ పార్టీలతో పొత్తు పెట్టుకోం

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి



ప్యారీస్, ఏప్రిల్ 2: భవిష్యత్తులో కూడా డీఎంకే, అన్నాడీఎంకేలతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ప్రకటించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పొత్తు పెట్టుకోవడంపై తన తండ్రి రాందాస్‌కు, తనకు మధ్య భిన్నాభిప్రాయాలు పొడసూపలేదని, కానీ సోషల్ మీడియాలో దీనిపై లేనిపోని తప్పుడు కథనాలు వైరల్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం దిండివనం సమీపంలో ఉన్న తైలావరం గార్డెన్‌లో తన తండ్రి రాందాస్‌తో భేటీ అయ్యాక ఈ కథనాలు ప్రసారమయ్యాయని వివరించారు. తాము ఎన్నికలకు సంబంధించి అన్నాడీఎంకే, డీఎంకేలతో రాయబారం సాగించలేదన్నారు. రాష్ట్రంలో వంతుల వారీగా అధికారం చేపడుతున్న ద్రావిడ పార్టీల పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, అందువల్లే ఈ లోక్‌సభ ఎన్నికల్లో దేశ క్షేమాన్ని కోరుకుంటున్న బీజేపీతో చేతులు కలిపామన్నారు. ఎన్డీఏ కూటమి అధిక స్థానాల్లో గెలిచే అవకాశముందని పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకేతో పొత్తు ఉండబోదని పునరుద్ఘాటించారు.

5న తెన్‌కాశిలో అమిత్‌షా పర్యటన



చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈనెల 5న తెన్‌కాశిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించనున్న రోడ్‌షోలో పాల్గొననున్నారు. 5వ తేదీ మధ్యాహ్నం హెలికాప్టర్‌లో తెన్‌కాశి సమీపం ఇలంజిలో రామసామి పిళ్లై పాఠశాల మైదానంలో దిగనున్నారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి ఆజాద్‌నగర్ చేరుకుని కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. ఆజాద్‌నగర్ నుంచి తెన్‌కాశి కొత్త బస్‌స్టేషన్ వరకూ ఓపెన్‌టాప్ వ్యాన్‌లో ఆయన రోడ్‌షోలో పాల్గొంటారు. అమిత్‌షా రోడ్‌షో మార్గంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టడానికి స్థానిక పోలీసు ఉన్నతాధికారులు తగు చర్యలు చేపడుతున్నారు.

రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలపై 561 కేసులు

● హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం



చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై 561 కేసులు నమోదై ఉన్నట్లు మద్రాసు హైకోర్టుకు ప్రభుత్వం నివేదించింది. లోక్‌సభ, శాసనసభ సభ్యులపై నమోదైన కేసులపై ప్రత్యేక కోర్టుల్లో విచారణ సక్రమంగా జరుగుతుందో లేదో నిఘా వేయాలని, అవసరమైతే సుమోటోగా కేసుల విచారణ చేపట్టాలని తరచూ ఉత్తర్వులు జారీ చేయాలని సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టులకు ఉత్తర్వు జారీ చేసింది. ఈమేరకు మద్రాసు హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతోంది. మంగళవారం జరిగిన ఆ కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్‌ను సమర్పించింది. రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలపై 561 కేసులు నమోదై ఉన్నాయని, అవినీతి నిరోధక చట్టం కింద 20 కేసులున్నాయని, మరో 20 అవినీతి కేసుల్లో 9 కేసులకు సంబంధించి సాక్షుల విచారణ త్వరలో పూర్తవుతుందని పేర్కొంది. ఆ వివరాలను నమోదు చేసుకున్న హైకోర్టు తదుపరి విచారణను జూన్ 20వ తేదీకి వాయిదా వేసింది.

రాజకీయ నాయకులను ప్రశ్నించడం ప్రజల బాధ్యత

● ఎంఎన్‌ఎం అధ్యక్షుడు కమల్


ఎండీఎంకే అభ్యర్థి దురై వైగోకు మద్దతుగా ప్రచారం చేస్తున్న కమల్

పెరంబూర్, ఏప్రిల్ 2: రాజకీయ నాయకులను ప్రశ్నించడం ప్రజల హక్కు, ఆ హక్కులను ప్రజలు నెరవేరుస్తూ ఉంటేనే దేశానికి మేలు జరుగుతుందని మక్కల్ నీతి మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు కమలహాసన్ తెలిపారు. తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే కూటమిలో పోటీ చేస్తున్న ఎండీఎంకే అభ్యర్థి దురై వైగోకు మద్దతుగా కమల్ మంగళవారం శ్రీరంగంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కమల్ మాట్లాడుతూ... నా తమ్ముడు దురై వైగో కోసం ఇక్కడికి వచ్చానని అన్నారు. ద్రావిడ మోడల్ నిన్న, నేడు వచ్చింది కాదన్నారు. ద్రావిడ మోడల్ త్వరలోనే దేశానికే మోడల్‌గా మారుతుందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉదయం అల్పాహార పథకంగా మార్చారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన నిధులు కేంద్రప్రభుత్వం అందించడం లేదని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అందిస్తున్న నిధులతో పోల్చితే రాష్ట్రానికి తక్కువగా అందుతోందని తెలిపారు. రాష్ట్రం నుంచి వసూలవుతున్న పన్ను వాటాలో రూపాయికి 29 పైసలు మాత్రమే కేంద్రం ఇస్తోందన్నారు. ఆ నిధులు పెంచితే రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసే అవకాశముందని కమల్ పేర్కొన్నారు.

పుదుచ్చేరిలో బీజేపీ ఆఫీసు వద్ద ఐజేకే కార్యకర్తల ఘర్షణ


ప్రచార వాహనంపై బ్యానర్‌ను చింపుతున్న ఐజేకే కార్యకర్త

పుదుచ్చేరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని బీజేపీ కార్యాలయం వద్ద ఐజేకే కార్యకర్తలు మంగళవారం ఉదయం ఘర్షణకు దిగారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా మంత్రి నమశ్శివాయం పోటీ చేస్తున్నారు. మిత్రపక్షమైన ఐజేకే నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఐజేకే కార్యకర్తలు బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని మంగళవారం ఉదయం సందర్శించారు. ఆ సమయంలో అక్కడే నిలిచి ఉన్న ప్రచార వాహనం బ్యానర్‌లో ఐజేకే నుంచి డిస్మిస్ అయిన సత్యవేల్ ఫొటో ఉండటం చూసి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో సత్యవేల్ కూడా ఆ ప్రాంతంలోనే సంచరిస్తుండటాన్ని చూసి మరింత రెచ్చిపోయారు. అన్నాదురై నాయకత్వంలో ఐజేకే కార్యకర్తలు సత్యవేల్ వర్గీయులతో ఘర్షణకు దిగారు. సత్యవేల్‌పై దాడి జరిపారు. దీనితో ఆగ్రహించిన పార్టీ కార్యకర్తలు ప్రచార వాహనం బ్యానర్‌ను కూడా చింపి వేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో సత్యవేల్ ప్రచారవాహనంతో అక్కడి నుంచి మెరుపువేగంతో మాయమయ్యారు.

కెనడాలో అల్పాహార పథకం అమలు

● డీఎంకే ప్రభుత్వ విజయం : సీఎం స్టాలిన్

అడయార్, ఏప్రిల్ 2: కెనడాలో ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభమైంది. దీనిపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. ఇది తమ ప్రభుత్వం విజయంగా ఆయన పేర్కొన్నారు. కెనడాలో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆ దేశ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ప్రకటించారు. దీనిపై సీఎం స్టాలిన్ మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న అల్పాహార పథకానికి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభించిందన్నారు. ఇది తమ ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకం అమలు అద్భుతంగా సాగుతుందన్నారు. ఈ పథకానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు సాగుతుందన్నారు. ఈ పథకాన్ని దేశంలోని పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. ఇపుడు కెనడా దేశంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఆ దేశ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

సమాచార దర్శిని

రప్తిసాగర్ దారి మళ్లింపు

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ మార్గాన్ని తాత్కాలికంగా మళ్లించినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ నెల 4, 5, 7 తేదీల్లో ఉదయం 6.35 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరే రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ (12511) మల్హార్, లక్నో, మానక్ నగర్‌ల మీదుగా పయనించనుంది. ఈ రైలు గోమ్‌తి నగర్, బాద్‌షా నగర్, దాలిగంజ్, లక్నో సిటీ, ఐష్‌బాష్ స్టేషన్లకు వెళ్లదు. అదే విధంగా ఈ నెల 2, 3, తేదీల్లో ఉదయం 6.35 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరే రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ (12512) మనక్‌నగర్, లక్నో, మల్హార్‌ల మీదుగా పయనించనుంది. ఈ రైలు ఐష్‌బాగ్, లక్నో సిటీ, దాలిగంజ్, బాద్‌షా నగర్ స్టేషన్లకు వెళ్లదు. అంతేగాక ఈ నెల 8వ తేదీన రాత్రి 10.50 గంటలకు బరౌనీలో బయలుదేరే రప్తిసాగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12521) కూడా మల్హార్, లక్నో, మనాక్ నగర్‌ల మీదుగా పయనించనుంది. గోమ్‌తి నగర్, బాద్‌షానగర్, దాలిగంజ్, లక్నో సిటీ, ఐస్‌బాగ్ స్టేషన్లకు వెళ్లదు.

రూ.30.50 తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో ఈ నెల వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.30.50 మేరకు తగ్గింది. మార్చిలో గృహ వినియోగ సిలిండర్ 818.50కి విక్రయం కాగా, ఈ నెల ధరలో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు. గత నెల 1960.50కి విక్రయమైన వాణిజ్య గ్యాస్ సిలిండర్ రూ.1930కి విక్రయమవుతోంది.

కేవీ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: కేంద్రీయ విద్యాలయ పాఠశాలల్లో 1వ తరగతి విద్యార్థుల చేరికకు దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. విద్యార్థులు ఈ ఏడాది మార్చి 31 నాటికి 6 సంవత్సరాలు నిండినవారై వుండాలి. ఈ నెల 15వ తేదీ లోపు http://kvsonlineadmission.kvs.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అడ్మిషన్ విధానం, నిబంధనలు ఇదే వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

రేపటినుంచి తడ పెరియస్వామి ప్రచారం

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: బీజేపీ నుంచి వైదొలగి ఇటీవలే అన్నాడీఎంకేలో చేరిన తడ పెరియస్వామి ఆ పార్టీ, కూటమి అభ్యర్థులకు మద్దతుగా గురువారం నుంచి ప్రచారం చేపట్టనున్నారు. ఈ నెల 4న కాంచీపురం, 6న విల్లుపురం, 8న చిదంబరం, 10న నాగపట్టినం, 12న తిరువళ్లూరు, 13న, తేని, కళ్లకుర్చి, 14న సేలం, 15న నామక్కల్, 16న నీలగిరి నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్‌కేజీ ఉచిత అడ్మిషన్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: ఎల్‌కేజీ ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 22 నుంచి మే 20వ తేదీ వరకు జరగనుంది. ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద మైనార్టీ కాని ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, లేక 1వ తరగతిలో 25 శాతం ప్రభుత్వ కోటా సీట్లకు అడ్మిషన్లు జరగనున్నాయి. విద్యార్థులకు ఫీజును ప్రభుత్వమే పాఠశాలలకు అందజేస్తుంది. వచ్చే విద్యా సంవత్సరం చేరికకు నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. Rte.tn.schools.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను పరిశీలించి మే నెల 27వ తేదీ లోగా అర్హులకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.1800 కోట్ల ఆస్తి పన్ను వసూలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: చెన్నై కార్పొరేషన్‌లో ఆస్తిపన్ను ద్వారా రూ.1800 కోట్లు వసూలైంది. ఆస్తిపన్ను ఏడాదికి రెండుసార్లు వసూలు చేస్తున్నారు. ఒక్కో ఆర్థిక సంవత్సరం 13 లక్షల మందికి పైగా ఆస్తుల యజమానుల నుంచి కార్పొరేషన్ పన్నులు వసూలు చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం రూ.1680 కోట్లకు వసూలు చేసేందుకు లక్ష్యం నిర్దేశించింది. ఈ నేపథ్యంలో పన్ను చెల్లింపుకు రెండో అర్ధవార్షిక గడువు మార్చి 31వ తేదీతో ముగిసింది. నిర్ణయించిన లక్ష్యం కంటే అదనంగా రూ.1800 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. అలాగే వాణిజ్య పన్ను వసూళ్ల లక్ష్యం రూ.550 కోట్లు నిర్ణయించగా రూ.565 కోట్లు వసూలైందని ఆదాయ పన్ను శాఖ అధికారులు తెలిపారు.

42.64 కోట్ల యూనిట్లు పెరిగిన విద్యుత్ వినియోగం

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో వేసవి ప్రభావంతో విద్యుత్ వినియోగం 42.64 కోట్ల యూనిట్లకు పెరిగిందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా, పగటిపూట తక్కువగా విద్యుత్ వినియోగం ఉంటుంది. రాష్ట్రంలో దినసరి 30 కోట్ల యూనిట్లుగా ఉండే విద్యుత్ వినియోగం వేసవిలో పెరుగుతుంది. గత ఏడాది ఏప్రిల్ 20వ తేదీ విద్యుత్ వినియోగం 42.37 కోట్ల యూనిట్లు గరిష్ఠంగా నమోదై రికార్డు స్థాయిలో ఉంది. ఈ నేపథ్యంలో గృహాల్లో ఏసీల వినియోగం ఎలక్ట్రిక్ వాహనాల పెంపు, ఐపీఎల్ క్రికెట్ వంటి కారణాలతో గత మార్చి 29వ తేదీన 42.64 కోట్ల యూనిట్లుగా విద్యుత్ వినియోగం పెరిగింది.

తగ్గిన భవానీ సాగర్ నీటిమట్టం

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: ఈరోడ్ జిల్లా భవానీ సాగర్ డ్యాం నీటిమట్టం ఆరేళ్ల అనంతరం 48 అడుగులకు తగ్గింది. 105 అడుగుల సామర్థ్యం కలిగిన ఈ డ్యాం ద్వారా తిరుప్పూర్, ఈరోడ్డు, కరూర్ జిల్లాల్లో 2.50 లక్షల ఎకరాల భూములు సాగవుతున్నాయి. నీలగిరి కొండ ప్రాంతాల్లో కొన్ని నెలలుగా వర్షాలు ఎక్కువగా కురవకపోవడంతో డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గింది. నీటి విడుదల ఎక్కువ కావడంతో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. సోమవారం గణాంకాల ప్రకారం డ్యాం నీటిమట్టం 48.94 అడుగులకు తగ్గింది. 2018 మే 15న 40.20 అడుగులకు పడిపోయింది. మళ్లీ ఆరు సంవత్సరాల అనంతరం ప్రస్తుతం 48 అడుగులకు తగ్గడం గమనార్హం. నెల రోజులుగా భవానీసాగర్ డ్యాంకు 50 ఘనపుటడుగుల లోపు నీరు వచ్చి చేరుతోంది.

1930 కి.మీ. మేర సీఎం పయనం

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: ముఖ్యమంత్రి స్టాలిన్ ఎన్నికల ప్రచారంలో 1930 కి.మీ మేర ప్రయాణించి ఓట్లు అభ్యర్థించారు. మార్చి 22న తిరుచ్చిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన స్టాలిన్.. ఇప్పటి వరకూ తిరుచ్చి, పెరంబలూర్, తంజావూర్, నాగపట్టినం, కన్నియా కుమారి, తిరునెల్వేలి, తూత్తుకుడి, రామనాథపురం, తెన్‌కాశి, విరుదునగర్, ధర్మపురి, కృష్ణగిరి, సేలం, కళ్లకుర్చి, ఈరోడ్డు జిల్లాల్లో పర్యటించారు. ఈ ప్రచారం ప్రారంభించిన రోజు నుంచి 1930 కి.మీ. మేర ప్రయాణించారు.

24న వీసీ ఎంపిక కమిటీ కేసు తీర్పు

పెరంబూర్, ఏప్రిల్ 2: మద్రాసు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఎంపిక కమిటీ కేసులో ఈ నెల 24న మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించనుంది. ఉపకులపతి ఎంపిక కమిటీలో విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యులకు చోటు కల్పించలేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన ఎంపిక కమిటీ నియమాక జీవో రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది జగన్నాథ్ పిటిషన్ దాఖలుచేశారు.




సభలో ప్రసంగిస్తున్న ఈపీఎస్ - ప్రచారానికి హాజరైన అన్నాడీఎంకే కార్యకర్తలు

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

● సీఎంకు ఈపీఎస్ సవాల్

వేలూరు, ఏప్రిల్ 2: వేలూరు, రాణీపేట జిల్లాల అభివృద్ధికి ఎవరేం చేశారో తేల్చేందుకు చర్చకు తాను సిద్ధమని, ఇందుకు సీఎం స్టాలిన్ కూడా సిద్ధమేనా అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సవాల్ విసిరారు. మంగళవారం ఆయన రాణీపేట జిల్లా అరక్కోణం పార్లమెంటు నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి ఏఎల్ విజయన్‌కు మద్దతుగా ప్రచార సభలో ప్రసంగించిరు. త్వరలో వేలూరు, రాణీపేట జిల్లాల్లో ప్రచారానికి రానున్న ముఖ్యమంత్రిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రా ప్రభుత్వం పాలారుపై చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల దిగువనున్న రాష్ట్ర ప్రాంతాలు తీవ్రంగా నష్టపోతాయని, అక్కడ వ్యవసాయం కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డీఎంకే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు అన్నాడీఎంకే సీనియర్ నేతలు కూడా పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఎస్ఐఎంయుఎన్ సమ్మిట్



సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న రాజేష్ డోంగ్రా తదితరులు

అడయార్, ఏప్రిల్ 2: కోయంబత్తూరు వేదికగా ఈ నెల 1న ప్రారంభమైన సౌత్ ఇండియన్ మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎస్ఐఎంయుఎన్) సదస్సు బుధవారంతో ముగియనుంది. కోవైలోని ది ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఈ సదస్సు ప్రారంభంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ రాజేష్ డోంగ్రా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డోంగ్రాను ది ఇండియన్ పబ్లిక్ స్కూల్ సీఈవో డాక్టర్ తారా మోహన్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సదస్సులో జీ20, యునెస్కో, యుఎన్‌హెచ్‌ఆర్‌సీ, డబ్ల్యూహెచ్‌వో, యుఎన్‌ఎస్‌సీ, నాటో తదితర అంశాలపై చర్చించారు. ఇందులో 50కు పైగా పాఠశాలలకు చెందిన 1200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఒక ప్రాంతం, దేశం లేదా నిర్దిష్ట వ్యక్తుల సమూహాన్ని బెదిరించే అనేక సవాళ్లు, సంక్షోభాలు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఇలాంటి అంశాలపై ఇందులో కూలంకషంగా చర్చించారు.

లిఫ్ట్ జారిపడి కార్మికుడు మృతి

పెరంబూర్, ఏప్రిల్ 2: తిరుప్పూర్ జిల్లా అవినాశి సమీపం పుదుపాళయంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లిఫ్ట్ జారిపడిన ఘటనలో కార్మికుడు మృతి చెందాడు. భవన నిర్మాణ పనుల్లో పాల్గొన్న సమయంలో లిఫ్ట్ పడిన ఘటనలో సోను (22) అనే యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీని ఢీకొన్న ఆమ్నీ బస్సు

● డ్రైవర్ సహా ఇద్దరి మృతి



ధ్వంసమైన ఆమ్నీ బస్సును క్రేన్‌తో తొలగిస్తున్న కార్మికులు

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి డెయిరీ సమీపంలో ఫ్లైఓవర్‌పై మంగళవారం వేకువజాము సంభవించిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ సహా ఇరువురు మృతి చెందారు. 12 మంది ప్రయాణికులు గాయపడ్డారు. చెన్నై నుంచి కంభం ప్రాంతానికి 34 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆమ్నీ బస్సు వేకువజాము 5.30 గంటలకు తిరుచ్చి డెయిరీ సమీపంలోని ఫ్లైఓవర్‌పై వెళ్తుండగా అదుపు తప్పి ముందువైపు ఇటుకలలోడుతో వెళుతున్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్ డ్రైవర్ చంద్రన్, దిండుగల్‌కు చెందిన ప్రయాణికురాలు పళనియమ్మాళ్ (60) తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. బస్సులో ప్రయాణించిన 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొట్టై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

మహిళ హత్య కేసులో తాపీ మేస్త్రి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 2: స్థానిక ఎంజీఆర్ నగర్‌లో మహిళపై అత్యాచారానికి పాల్పడి హతమార్చిన కేసులో తాపీ మేస్త్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం జిల్లాకు చెందిన ఆర్ముగం భార్య శరణ్య గత 6 నెలలుగా ఎంజీఆర్ నగర్ చూలపల్లంలో అద్దెకు తీసుకున్న ఇంట్లో నివసిస్తూ కూలీలకు వెళుతోంది. గత నెల 29వ తేది రోజులాగే విధుల్లో పాల్గొన్న శరణ్యను తిరువొత్తియూర్‌కు చెందిన తాపీ మేస్త్రి వేల్‌మురుగన్ (40), కూలీలందరూ ఇంటికి వెళ్లిపోయాక లైంగిక వేధింపుల పాల్పడడంతో ఆమె తప్పించేకొనే ప్రయత్నం చేసింది. దాంతో ఆమెను దారుణంగా హతమార్చి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన ఎంజీఆర్ నగర్ పోలీసులు, తిరుప్పూర్ జిల్లా పొల్లాచ్చిలో ఓ ఇంట్లో తలదాచుకున్న వేల్‌మురుగన్‌ను మంగళవారం ఉదయం అరెస్ట్ చేసి విచారణ నిమిత్తం చెన్నైకి తీసుకొస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 2: సరిగా చదవలేకపోతున్నానంటూ ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరునల్వేలి జిల్లాలో జరిగింది. తెన్‌కాశి జిల్లా పనపొళికి చెందిన అయ్యప్పన్ కుమార్తె నాగలక్ష్మి (18) తిరునల్వేలిలో ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె కళాశాల ప్రాంగణంలోని హాస్టల్‌లో ఉంటోంది. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి తన గదికి వెళ్లిన నాగలక్ష్మి ఉరేసుకుంది.ఈఘటనపై హాస్టల్ నిర్వాహకుల ఫిర్యాదుతో అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని తిరునల్వేలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల విడుదలైన సెమిస్టర్ పరీక్షల్లో పలు పాఠ్యాంశాల్లో నాగలక్ష్మి తక్కువ మార్కులు వచ్చాయని, అప్పటి నుంచి ఆమె ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉండేదని పోలీసుల ప్రాథమిక విచారణతో తెలిసింది.

ఊటీ బొటానికల్ గార్డెన్‌లో సినిమా షూటింగ్‌లు నిలిపివేత

పెరంబూర్, ఏప్రిల్ 2: వేసవి సీజన్ ప్రారంభం కావడంతో ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డెన్‌లో షూటింగ్‌లు నిషేధించారు. ప్రకృతి రమణీయమైన ఊటీలోని పలు ప్రాంతాల్లో తమిళం, మళయాలం, తెలుగు, హిందీ సహా పలు భాషల చిత్రాల షూటింగ్‌లు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో, జిల్లాలో ప్రతి ఏడాది ఏప్రిల్, మే నెలల్లో వేసవి సీజన్ దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఊటీకి వస్తుంటారు. పర్యాటకుల సౌకర్యార్థం ఈ సీజన్‌లో సినిమా షూటింగ్‌లకు నిషేధం విధిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈఏడాది మంగళవారం నుంచి మూడు నెలలు సినిమా షూటింగ్‌లకు నిషేధం విధిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.

ఓటర్లకు బూత్ స్లిప్‌ల పంపిణీ ప్రారంభం



వేలూరు, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల కోసం వేలూరు జిల్లాలో బూత్ స్లిప్‌ల పంపిణీ ప్రారంభమైంది. మంగళవారం సత్తువాచారి సీఎంసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ఎన్నికల అధికారి నందిత, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

వేలూరులో ఏసీ షణ్ముగం ప్రచారం



వేలూరు, ఏప్రిల్ 2: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న సీనియర్ నేత ఏసీ షణ్ముగం మంగళవారం అంబూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దళితులు, మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కచ్చాదీవికి విముక్తి కల్పిస్తామన్నారు. ఆంధ్రాప్రభుత్వం పాలారుపై చేపడుతున్న చెక్ డ్యాం నిర్మాణాలను అడ్డుకుంటామని హామీనిచ్చారు.

కచ్చాదీవి విముక్తి పనులు ప్రారంభం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, ఏప్రిల్ 2: శ్రీలంక ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కచ్చాదీవిని విడిపించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. కోవై లోక్‌సభ నియోజకవర్గంలో పోటీచేస్తున్న అన్నామలై మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... తమిళ జాలర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చేపల వేటలో పాల్గొనేలా కేంద్ర ప్రభుత్వం లంక ప్రభుత్వంతో చేపట్టిన చర్యలు త్వరలో ఫలిస్తాయన్నారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శ్రీలంకకు అప్పగించిన కచ్చాదీవిని తిరిగి పొందే పనులు ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. సాంకేతికంగా, న్యాయపరంగా కేంద్రం ప్రయత్నాలు చేపట్టిందని, ఎన్నికల సమయంలో ఈ ప్రాముఖ్యంగురించి మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఏర్పడిందని అన్నామలై తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో కాంట్రాక్టర్లు

ప్యారీస్, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో చేపట్టిన రోడ్ల మరమ్మలు ఒక్కసారిగా ఆగిపోయాయి. దీంతో పనులు పూర్తి చేయలేక అధికారులు సతమతమవుతున్నారు. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో గత సంవత్సరం డిసెంబరులో మిచౌంగ్ తుఫాను కారణంగా రహదారులు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెల్సిందే. రోడ్లన్నీ గుంతలమయం కావడంతో వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించిన రాష్ట్ర రహదారుల విభాగ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం ఊపందుకోవడంతో పలు పార్టీల ఎమ్మెల్యేలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను మెప్పించే విధంగా ప్రచారంలో పాల్గొనడం వల్ల ఆ పనులు స్తంభించిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లను నిలదీయలేని పరిస్థితులను ప్రభుత్వ అధికారులు ఎదుర్కొంటున్నారు.

261 మంది రౌడీలపై 1977 కేసులు

● రౌడీలందరూ బీజేపీ నేతలా?

అడయార్, ఏప్రిల్ 2: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీలో వివిధ పదవుల్లో 261 మంది రౌడీలు ఉన్నట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. వీరిపై దాదాపు 1977 కేసులు నమోదైవున్నట్టు సమాచారం. ఈ రౌడీలపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు సైతం వెనుకంజ వేస్తున్నారు. దీనికి కారణం కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉండటంతో కేంద్ర సర్వీసుకు చెందిన తాము తొందరపడి చర్యలు తీసుకుంటే ఆ తర్వాత బాధపడాల్సి వస్తుందని వారు జంకుతున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాజీ ఐపీఎస్ అధికారి కె.అన్నామలై బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే చర్యల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఆ పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నాయి. ఇలా కాషాయం కండువా కప్పుకునే వారిలో పలువురు రౌడీలు ఉన్నట్టు సమాచారం. వీరిలో అనేక మందికి పార్టీలో వివిధ స్థాయిల్లో పదవులు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 261 మంది రౌడీలు బీజేపీలో వివిధ స్థాయి పదవుల్లో ఉన్నారని, వీరిపై 1977 కేసులు నమోదైవున్నట్టు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

రెండో సారి ఎంపీ కనిమొళి వాహనం తనిఖీ



కనిమొళి వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పెరంబూర్, ఏప్రిల్ 2: డీఎంకే ఎంపీ కనిమొళి వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రెండో సారి తనిఖీ చేశారు. తిరునల్వేలి జిల్లా పాళయం కోటలో మంగళవారం ఉదయం ప్రచారానికి వెళ్తున్న కనిమొళి వాహనాన్ని అధికారులు అడ్డుకొని తనిఖీ చేశారు. ఆ సయమంలో కారులో మంత్రి తంగం తెన్నరసు కూడా ఉన్నారు. 15 నిమిషాలకు పైగా తనిఖీల అనంతరం కారులో ఎలాంటి వస్తువులు లేకపోవడంతో అధికారులు కారు వెళ్లేందుకు అనుమతించారు.



రిప్పన్‌భవనంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నగరంలో మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను ఎంపిక చేసే ప్రక్రియ గురించి వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాధాకృష్ణన్

అంబత్తూరు తేజ హాస్పిటల్‌లో అత్యంత క్లిష్ట ఆపరేషన్ సక్సెస్



రోగి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ విజయసారథి

అడయార్, ఏప్రిల్ 2: స్థానిక అంబత్తూరులోని తేజ హాస్పిటల్‌లో 91 యేళ్ల వృద్ధురాలికి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను ఆ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఒరగడం ప్రాంతానికి చెందిన రాణి (91)కి నాలుగు రోజుల క్రితం హిప్ బోన్ ఫ్రాక్చర్ అయింది. దీంతో ఆమె పలు ఆస్పత్రులకు వెళ్ళగా ఆమె వయసురీత్యా ఆపరేషన్ ద్వారా సమస్యను సరి చేసేందుకు వైద్యులు ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో అంబత్తూరులో డాక్టర్ విజయసారధి, డాక్టర్ సరోజిని దంపతుల నేతృత్వంలో సాగుతున్న తేజ హాస్పిటల్‌లోని వైద్యులు ఆమెకు అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను చేసేందుకు ముందుకు వచ్చారు. డాక్టర్ ఆదిత్య రెడ్డి, డాక్టర్ దిగ్విజయ్ తేజతో కూడిన వైద్య బృందం సీ-ఆర్మ్ సాంతో ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు శస్త్రచికిత్స మొదలుపెట్టి.. రాత్రి 9 గంటలకు పూర్తి చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా హిప్ బోన్ ప్రాంతంలో స్టీల్‌ను అమర్చి జాయింట్ చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, ఆపరేషన్ పూర్తిచేసిన 24 గంటల్లోనే రోగి కోలుకుని నర్సుల సాయంతో నడవడం కూడా మొదలుపెట్టారని తేజ హాస్పిట్ అధిపతి డాక్టర్ విజయసాథి వెల్లడించారు. వయస్సు రీత్యా ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్లు ఎంతో రిస్క్‌తో కూడుకున్నవని, అయినప్పటికీ తమ ఆస్పత్రి వైద్యుల బృందం విజయవంతంగా పూర్తి చేసిందని ఆయన వెల్లడించారు.

కళాకారులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభినందన



చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ విజయ్ 1971' పేరుతో థియేటర్ నాటక ప్రదర్శన చేపట్టిన కళాకారులను మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ విజయ్‌కుమార్ గంగాపూర్‌వాలా అభినందించారు. వేశ్చేరిలోని గురునానక్ కాలేజీలో జరిగిన ఈ నాటక ప్రదర్శన నాటి ఆపరేషన్ విజయ్ ఘటనను సాక్షాత్కరించింది. గత చరిత్రాత్మక సంఘటలను గుర్తు చేసింది. దీన్ని వీక్షించిన అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ... గత చరిత్ర ఘటనలను గుర్తు చేసే ఒక అద్భుతమైన నిర్మాణమే ఈ నాటకమని ప్రశంసించారు. ఆపరేషన్ విజయ్ సమయంలో భారత సాయుధ బలగాల పరాక్రమం, త్యాగం, తిరుగులేని స్ఫూర్తిని స్పష్టంగా వర్ణిస్తుందన్నారు. నిజమైన హీరోలకు పాదాభివందనం చేయడతో పాటు చరిత్రలోని నిజమైన సారాంశాన్ని వెలుగులోకి తెచ్చిన రంగస్థల కళాకారులను కొనియాడారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొని రిటైర్డ్ కల్నల్ కృష్ణస్వామిని ఈ సందర్భంగా జస్టిస్ గంగాపూర్‌వాలా సత్కరించారు.

కృత్రిమ మేధోపరిజ్ఞానంపై దృష్టి సారించండి

ఎస్ఆర్ఎం వర్శిటీ ప్రోఛాన్సలర్ సత్యనారాయణన్



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న పి.సత్యనారాయణన్ తదితరులు

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విప్లవాత్మక మార్పులకు దోహదం చేసే కృత్రి మ మేధో పరిజ్ఞానం పై విద్యార్థులు ప్రత్యే క దృష్టి సారించాలని, ఆ విజ్ఞానమే మానవాళికి మేలు చేయగలుగుతుందని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ప్రోఛాన్సలర్ డాక్టర్ పి. సత్యనారాయణన్ పిలుపునిచ్చారు. 'కృత్రిమ మేధో పరిజ్ఞానం- అంతర్జాతీయ నైతిక విలువలు అనేఅంశంపై మంగళవారం ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. అంతర్జాతీయ వైద్య సమాచార సంబంధాల మండలి సెక్రెటరీ జనరల్ డాక్టర్ వేదప్రకాష్ మిశ్రా స్వాగతోపన్యాసం చేశారు. బయో ఎథిక్స్ అంతర్జాతీయ విద్యా విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ రస్సెల్ ఫ్రాంకో డి సౌజా, ఎస్ఆర్ఎం వర్శిటీ డీన్ ప్రొఫెసర్ ఎం.నాగర్కర్ తదితరులు పాల్గొన్నారు.

యు-9 గర్ల్స్ సింగిల్స్ బ్యాడ్మింటన్‌లో శాన్వి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న శాన్వి లట్టాల

అడయార్, ఏప్రిల్ 2: తమిళనాడు ఓపెన్ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ 2024 ఆదివారం నగరంలోని షటిల్ మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగాయి. ఈ పోటీల్లో అండర్-9 బాలిక సింగిల్స్ విభాగంలో తెలుగమ్మాయి శాన్వి లట్టాల అద్భుతమైన ఆట తీరుతో ప్రశంసలు అందుకుంది. సెమీ ఫైనల్‌లో తనీషా అగర్వాల్‌పై 21-10, 21-14 తో గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. తుది పోరులో రియాపై 21-19, 18-21, 21-14 స్కోరుతో పోరాడి గెలిచింది. ఈ టోర్నీ విజేతలకు కంబాయ్ స్పోర్ట్స్ నిర్వాహకులు ట్రోఫీ, సర్టిఫికెట్లతో పాటు గోల్డ్ కాయిన్, బ్యాడ్మింటన్ కిట్ అందించారు. ఈ చిన్నారి గురించి ప్రధాన కోచ్ వేణు ముప్పాల మాట్లాడుతూ... బ్యాడ్మింటన్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న శాన్వి.. భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ క్రీడలో రాణించాలన్న తపన, పట్టుదల అనేక మంది అమ్మాయిల్లో కనిపిస్తుందన్నారు. ఇలాంటి వారు రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు సాధన చేస్తూ సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈనెల 10 నుంచి సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని చెప్పారు.

వైభవంగా రంగనాథస్వామి రథోత్సవం



ప్యారీస్, ఏప్రిల్ 2: స్థానిక పల్లావరం సమీ పంలోని తిరునీర్‌మలైలో ప్రసిద్ధిచెందిన రంగనాథ పెరుమాళ్ ఆలయంలో పంగుణి బ్రహ్మోత్స వాల్లో భాగంగా మంగళవారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. కొండపై ఉన్న ఈ ఆలయం 108 దివ్యదేశాల్లో ఒకటిగా విలసిల్లుతోంది. సుమారు 2 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో తిరుమంగై ఆళ్వార్, భూదత్ ఆళ్వార్లు స్వామివారి కటాక్షం కోసం కీర్తనలు ఆలపించి దర్శనభాగ్యం పొందిన స్థలం కావడం విశేషం. ఈ ఏడాది పంగుణి బ్రహ్మోత్సవాలు గత నెల ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం సందర్భంగా శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారిని ప్రత్యేకంగా అలం కరించి రథంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణ, మేళతాళాల మధ్య బయల్దేరిన రథం నాలుగు మాడవీధుల గుండా తిరిగి మళ్లీ రథ మండపానికి చేరుకుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణిలో లెక్కించారు. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 62,439 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,027 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. బీఆర్ఎస్ ఎంపీ లింగయ్య యాదవ్, తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, సునీత మహేందర్‌రెడ్డి దంపతులతోపాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఉన్నారు.

'సిద్ధం' సభకు ఆర్టీసీ బస్సులు

తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

నేడు, రేపు కూడా ఇదే పరిస్థితి


తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 2: 'సిద్ధం' సభకు తిరుపతి జిల్లా నుంచి 250 బస్సులను దారి మళ్లించడంతో సెంట్రల్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా జిల్లాలోని పశ్చిమ మండలాలకు నడిచే సర్వీసులను దాదాపుగా సభకు పంపేయడంతో మంగళవారం ఉదయం నుంచే కష్టాలు మొదలయ్యాయి. బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించడంతోపాటు సీట్ల కోసం ప్రయాణికులు కుస్తీ పడ్డారు. మరోవైపు అవకాశం ఉన్న ప్రతి స్టేజికి ప్రయాణికులను ఎక్కించుకోవాలని అధికారులు సూచించినా కొందరు డ్రైవర్లు, కండక్టర్లు పాటించలేదు. దీనిపై సిబ్బంది, ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న అధికారులు తమ సిబ్బందిని మందలించడంతో పరిస్థితి చక్కబడింది. దీనిపై పాకాలకు చెందిన జానకి అనే వృద్ధురాలు, చిన్నగొట్టిగల్లుకు చెందిన రాధమ్మ మాట్లాడుతూ.. బస్సులను ఇలా తరలించడం దారుణమన్నారు. కాగా, బుధ, గురువారాల్లో కూడా ఇదే పరిస్థితి ఉండనుంది.

5న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2: ఎస్వీయూనివర్సిటీ తెలుగు విభాగంలో ఈనెల 5వ తేదీన ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. తెలుగు విభాగం - ఈ తరం కవితా వేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడతారు. ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్లో జరిగే ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, సలహాదారు ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, ఈ తరం కవితా వేదిక అధ్యక్ష, కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, ఎస్జీడీ చంద్రశేఖర్ పాల్గొంటారు. విద్యార్థులు కవితా పఠనం చేస్తారు.


బీజేపీకి మద్దతుగా చెన్నై థౌజెండ్‌లైట్స్ వద్ద బీజేపీ జాతీయ నేతల బొమ్మలను చెక్కిన పుచ్చకాయలతో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు


కాంగ్రెస్ జెండాలతో మండుటెండలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు


తిరుచ్చిలో ఎండీఎంకే అభ్యర్థి దురై వైగోకు మద్దతుగా ఆ పార్టీ చిహ్నం అగ్గిపెట్టెలో అగ్గిపుల్లను వెలిగించి ప్రచారం చేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యా మొళి


కరూరులో ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతిమణి నుదుట కుంకుమ దిద్ది దిష్టితీస్తున్న మహిళలు


విరుదునగర్‌లో వాకింగ్ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న డీఎండీకే అభ్యర్థి విజయ్ ప్రభాకరన్

సార్వత్రిక సమరం

విలవంగోడులో విజేత ఎవరో?


కాంగ్రెస్ అభ్యర్థి తారగై కత్‌బర్ట్, అన్నాడీఎంకే అభ్యర్థి యు. రాణి, బీజేపీ అభ్యర్థి వీఎస్ నందిని, ఎన్‌టీకే అభ్యర్థి ఆర్ జెమిని

● నలుగురు మగువల మధ్యే తీవ్ర పోటీ

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 39 లోక్‌సభ నియోజకవర్గాలకు సార్వత్రిక ఎన్నికలతోపాటు కన్నియాకుమారి జిల్లాలోని విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ నెల 19న ఉపఎన్నిక జరుగనుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలకు కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకూ ఏడుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఎనిమిదోసారి గెలిచేందుకు సిద్ధమవుతోంది. కన్నియాకుమారి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలోనే తక్కువ ఓటర్లు కలిగిన ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులే ఎక్కువసార్లు గెలిచారు. ఈ నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. అయితే 1952, 1954 సంవత్సరాల్లో ఈ నియోజకవర్గం తిరువాంకూర్ కొచ్చి శాసనసభ పరిధిలో ఉండేది. 1957, 62, 67 సంవత్సరాల్లో మద్రాసు ప్రావిన్స్ శాసనసభ పరిధిలో ఉండేది. 1971 నుంచి విలవంగోడు రాష్ట్ర శాసనసభ పరిధిలోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ 12 సార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో 7 సార్లు కాంగ్రెస్, ఐదు సార్లు సీపీఎం అభ్యర్థులు గెలిచారు. ఈ నియోజకవర్గానికి 2011, 2016, 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన విజయతరణి వరుసగా గెలిచారు. 2021 ఎన్నికల్లో విజయతరణి 87,573 ఓట్లు పొందారు. బీజేపీ అభ్యర్థి ఆర్ జయశీలన్ 58,804 ఓట్లు, ఎన్టీకే అభ్యర్థి మేనిఆడ్లిన్ 12,292 ఓట్లు పొంది ఓటమిపాలయ్యారు. డీఎండీకే అభ్యర్థి ఎల్ లేన్‌సోని 2447 ఓట్లు పొంది డిపాజిట్ కోల్పోయారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడానికి ముందు విజయతరణి బీజేపీలో చేరడంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం ఈ నియోజవర్గంలో కాంగ్రెస్ తరఫున తారగై కత్‌బర్ట్, అన్నాడీఎంకే తరఫున యు.రాణి, బీజేపీ అభ్యర్థిగా వి.ఎస్.నందిని, ఎన్టీకే తరఫున ఆర్.జెమిని పోటీ చేస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీలకు చెందిన నలుగురు మహిళా అభ్యర్థులు ఈ నియోజకవర్గంలో పోటీకి దిగారు. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గాన్ని అన్నాడీఎంకే తన కూటమిలోని మిత్రపక్షమైన బీజేపీకి కేటాయించింది. ప్రస్తుతం అన్నాడీఎంకే అభ్యర్థిని బరిలోకి దింపింది. ఏడుసార్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఎనిమిదోసారి గెలిచేందుకు తహతహలాడుతోంది. ఈ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విజయతరణి ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి నందినికి మద్దతుగా మంగళవారం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం 2,37,382 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,17,694 మంది పురుషులు కాగా, 1,19,685 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో తాను సులువుగా గెలుస్తానని కాంగ్రెస్ అభ్యర్థి తారగై ధీమా వ్యక్తం చేస్తున్నారు. డీఎంకే కూటమి మిత్రపక్షాలకంటూ ఈ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటు బ్యాంకు ఉండటంతో ఆ ఓట్లన్నీ తనకు పోలవుతాయని ఆమె భావిస్తున్నారు. సోమవారం డీఎంకే మహిళా విభాగ నాయకురాలు కనిమొళి ఆమెకు మద్దతుగా ముమ్మరంగా ప్రచారం చేశారు.

తిరుపత్తూరు మార్కెట్‌లో ఈపీఎస్ ఓట్లవేట

● సీఎంగా ఉన్నప్పుడిలా పరిశీలించలేదే?!

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి... డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ బాణీలో ఉన్నట్టుండి తిరుపత్తూరు కూరగాయల మార్కెట్‌లో మంగళవారం ఉదయం ఓట్లవేట సాగించారు. అరక్కోణం, వేలూరు అభ్యర్థులకు మద్దతుగా సోమవారం సాయంత్రం ప్రచారం చేసిన ఈపీఎస్ తిరుపత్తూరు కృష్ణగిరి రోడ్డులోని స్టార్‌హోటల్‌లో రాత్రి బసచేశారు. మంగళవారం ఉదయం తిరుపత్తూరు శక్తినగర్‌లోని దినసరి కూరగాయల మార్కెట్ ప్రాంతానికి పార్టీ ప్రముఖులతో కలిసి కాలినడకనే వెళ్లి రెండాకుల గుర్తుపై ఓటేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. కూరగాయలు కొనేందుకు వచ్చిన స్థానికులను నవ్వుతూ పలకరించారు. తిరువణ్ణామలై నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరఫున పోటీ చేస్తున్న కలియపెరుమాళ్‌కు రెండాకుల గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. అక్కడి నుండి ఆకుకూరలు విక్రయించే వ్యాపారుల వద్దకు వెళ్ళి వారిని పలకరించారు. అక్కడి ఆకుకూరలు తాజాగా ఉన్నాయా అని పరిశీలించారు. ఈపీఎస్‌తో పాటు మాజీ మంత్రి కేసీ వీరమణి పార్టీ ప్రముఖులు కూడా పర్యటించారు.



కాయగూరల మార్కెట్ వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి - ఆకుకూరల వ్యాపారితో ముచ్చటిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

● అబద్ధం కూడా అతికినట్లు ఉండొద్దూ?!

డబ్బులు లేకున్నా 40 చోట్ల పోటీ


కరూరులో ఎన్టీకే అభ్యర్థి కరుప్పయ్యాకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ అధినేత సీమాన్

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన దగ్గర డబ్బు లేకపోవడంవల్లనే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేకపోయానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నామ్ తమిళర్ కట్చి అధినేత సీమాన్ ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రిగా ఉన్న ఆమెకు ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్ డిపాజిట్ చెల్లించే సొమ్ముకూడా లేదంటే ఎవరూ నమ్మరని పేర్కొన్నారు. కరూరులో పార్టీ అభ్యర్థి డాక్టర్ కరుప్పయ్యాకు మద్దతుగా ఆయన ప్రచారం చేస్తూ తాను కేంద్రమంత్రిలా ధనవంతుడి కానని, డబ్బులు లేకపోయినా ఈ ఎన్నికల్లో 40 చోట్ల తమ పార్టీని పోటి చేయించానని పేర్కొన్నారు.

గుడిసె రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

● సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కేంద్రప్రభుత్వ సాయంతో సెంట్రల్ చెన్నై నియోజకవర్గాన్ని గుడిసె రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతానని ఆ స్థానంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం ప్రకటించారు. మంగళవారం స్థానిక ఎంటీహెచ్ రోడ్, నాదముని, టవర్ బ్లాక్, భారతినగర్ ఆర్క్, ఆసియన్ గార్డెన్, సిడ్కోనగర్ మెయిన్‌రోడ్, అయ్యప్పన్‌కోయిల్, వల్లియమ్మ నగర్, నెహ్రూ నగర్, సౌత్ జగన్నాథ నగర్, నెహ్రూనగర్, రెడ్‌హిల్స్‌రోడ్, బాబా నగర్, రాజమంగళం లోని కొన్ని వీధుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వినోజ్ పి.సెల్వం మాట్లాడుతూ... ప్రజలు భావోద్వేగాలకు గురి కాకుండా, తమ ప్రాంతానికి ఎవరు న్యాయం చేస్తారో ఆలోచించి ఓటేయాలని కోరారు. మీలో ఒకడిగా సేవలందించేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు కులమతాలు, భేషజాలు తెలియవని, ప్రజల్లో, ప్రజల చేత, ప్రజల కోసం పని చేయడం మాత్రమే తనకు తెలుసని వివరించారు. గతంలో సెంట్రల్ చెన్నైకి పలుమార్లు ఎంపీగా వ్యవహరించిన దయానిధి మారన్ ఈ ప్రాంతానికి ఏం చేశారో ఒక్కసారి ప్రజలు ప్రశ్నించుకోవాలన్నారు. అలాంటి వ్యక్తిని మళ్లీ ఎంపీగా ఎన్నుకుంటే ప్రజలు మళ్లీ నిరాశకు గురికాక తప్పదని వినోజ్ పేర్కొన్నారు.


ప్రచారం చేస్తున్న వినోజ్ పి.సెల్వం

కల్లు దుకాణాలు తెరుస్తాం


కోవై సమీపం ఆనైకట్టి వద్ద ప్రచారం చేస్తున్న అన్నామలై

● సరికొత్త హామీ

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే టాస్మాక్ మద్యం దుకాణాలు మూసివేసి రాష్ట్రవ్యాప్తంగా కల్లు దుకాణాలు తెరిపిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై హామీ ఇచ్చారు. కోయంబత్తూరులో పోటీ చేస్తున్న అన్నామలై ఆనైకట్టి వద్ద మంగళవారం ఉదయం ప్రచారం చేశారు. ఓపెన్‌టాప్ వ్యాన్‌పై నిలిచి ఆయన ప్రసంగిస్తూ డీఎంకే ప్రభుత్వం టాస్మాక్ షాపుల్లో విక్రయిస్తున్న మద్యం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని, మద్యం తాగవద్దంటూ ఎవరినీ కట్టడి చేయలేమని, అదే సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ కల్లుగీత కార్మికుల సంక్షేమం దృష్ట్యా కల్లు దుకాణాలను తెరవాలని భావిస్తోందని అన్నారు. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు అన్ని సదుపాయాలు అందించే దిశగా పథకాలు రూపొందించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. ఎన్నికల తర్వాత ఇండియా కూటమి పత్తాలేకుండా పోతుందన్నారు.

● పాపం వీజీ రాజేంద్రన్

డీఎంకే ఎమ్మెల్యేను నిలదీసిన ఓటర్లు



ప్యారీస్, ఏప్రిల్ 2: తిరువళ్లూరు లోకసభ నియోజకవర్గంలో డీఎంఏ కూటమిలోని కాంగ్రెస్ తరఫున సచ్చిదానంద సెంథిల్ పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా ఉళందై గ్రామంలో డీఎంకే ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ కూటమి నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ అభ్యర్థి సెంథిల్‌కు ఓటు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. ఎమ్మెల్యే ప్రసంగించగానే 'నియోజకవర్గానికి గత మూడేళ్ళుగా ఏమీ చేయలేదు. ఎలా ఓట్లు అడుగుతున్నారు' అని స్థానికులు ఆవేశంలో ఎమ్మెల్యేను నిలదీయడంతో ఆయన ఖంగుతిన్నారు. ఆ వెంటనే ఆయన 'ఈ రోడ్డు వేయించింది తామేనని, ఆ వాటర్ ట్యాంకును నిర్మించి తామేనని' అంటూ పెద్ద స్వరంతో తనను ప్రశ్నించిన వారిని ఏకవచనంతో అవమానించారు. దీంతో మరింత ఆగ్రహం చెందిన ప్రజలు వరుస ప్రశ్నలు అడగటంతో వాటికి సమాధానాలు చెప్పలేక ఎమ్మెల్యే రాజేంద్రన్ అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి సెంథిల్... క్షమించాలని ఓటర్లను ప్రాధేపడి, ఆయన కూడా అక్కడ నుంచి వెళ్లిపోయారు.

బహుమతులు వద్దన్న మాజీ మంత్రి సెల్లూరు రాజు

ప్యారీస్, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే జిల్లా నాయకుల స్థాయి సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి సెల్లూరు కె.రాజు పాల్గొని ప్రసంగించడం మొదలుపెట్టారు. ఆయన శాపాలు పెట్టేవారుగా నాయకులు భావిస్తుంటారు. ఆ రోజు సెల్లూరు రాజు పుట్టి రోజు కావడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు పలువురు పుట్టిన రోజు కానుకగా ఆయనకు బహుమతులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, ఎన్నికల కోడ్ నియమావళి గుర్తుకు రావడంతో పార్టీ సభలో బహుమతులు పుచ్చుకుంటే తన ఎన్నికల లెక్కల్లోకి వస్తాయని దీనికి ఈసీ సమాధానం చెప్పాల్సి వస్తుందని ప్రకటించి బహుమతులు వద్దని మిన్నకుండిపోయారు. దీంతో కార్యకర్తలంతా ఘొల్లున నవ్వుకున్నారు.


సెల్లూర్ కె.రాజు

● ఇండియా కూటమి గెలిస్తే...

దేశవ్యాప్తంగా బడిపిల్లలకు అల్పాహారం

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా బడిపిల్లలకు అల్పాహార పథకాన్ని విస్తరింపజేస్తామని డీఎంకే ఎంపీ కనిమొళి చెప్పుకొచ్చారు. కన్నియాకుమారి జిల్లా విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తారగై కత్‌బర్ట్‌కు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం బ్రతకాలంటే ఇండియా కూటమి అభ్యర్థులకే ఓటెయ్యాలని కోరారు. పదేళ్లుగా రాష్ట్రానికి ఎలాంటి పథకాలు అమలు చేయలేని, రైతుల, జాలర్ల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోని ప్రధాని మోదీ ఉన్నట్టుండి తమిళ ప్రజలపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని, ఆయన చెబుతున్న కల్లబొల్లి కబుర్లను, హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు.


విలవంగోడులో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కనిమొళి

అదృష్టాన్ని పరీక్షించుకోనున్న సినీ ప్రముఖులు

అడయార్, ఏప్రిల్ 2: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పలువురు సినీ ప్రముఖులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇలాంటి వారిలో నటి రాధిక, దర్శకుడు తంగర్ బచ్చాన్, నిర్మాత విజయ్ వసంత్, నటుడు ఎం.కళంజియం ఉన్నారు. వీరిలో రాధికా ఎన్డీయే కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా విరుదునగర్ స్థానం నుంచి బరిలో నిలిచారు. ఈమె ప్రత్యర్థిగా నటుడు విజయ్ ప్రభాకరన్ ఇదే స్థానం నుంచి బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈయన అన్నాడీఎంకే కూటమి తరఫున డీఎండీకే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సినీ దర్శకుడు తంగర్ బచ్చాన్ అన్నాడీఎంకే కూటమిలోని పీఎంకే అభ్యర్థిగా కడలూరు స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే, కన్నియాకుమారి స్థానం నుంచి పోటీ చేస్తున్న విజయ్ వసంత్... గతంలో ఆయన తండ్రి వసంత్ కుమార్ నిర్మించిన చిత్రాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. అలాగే, ఎన్టీకే తరఫున విల్లుపురం (రిజర్వుడు) స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎం.కళంజియం చిత్రపరిశ్రమలో దర్శకుడిగా, కెమెరామెన్‌గా, రచయితగా ఉన్నారు. ఈయన తొలిసారి ఎన్నికల బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ప్రధాన అభ్యర్థులే కాకుండా చిత్ర పరిశ్రమతో సంబంధం ఉన్న మరికొందరు కూడా వివిధ స్థానాల్లో పోటీ చేస్తున్నారు.


పోటీలో ఉన్న సినీ ప్రముఖులు

ఆ సెగ్మెంట్లలో ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం

ప్యారీస్, ఏప్రిల్ 2: తమిళనాడు ప్రభుత్వ నిర్వహణలోని టాస్మాక్ సంస్థ విక్రయించే మద్యం రకాల ధరలు అధికంగా ఉండటంతో పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి మద్యాన్ని రాష్ట్రంలోకి అక్రమంగా దిగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన ధర్మపురి, కృష్ణగిరి, విల్లుపురం సహా పలు జిల్లాల్లో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రచార సభల్లో పాల్గొంటున్న ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలకు కర్ణాటక మద్యం బాటిల్‌ను అందిస్తున్నారు. టాస్మాక్ మద్యం బాటిళ్లతో పోల్చితే కర్ణాటక మద్యం ధరలు తక్కువ కావడంతో హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి, మటన్, చికెన్, బిర్యానీ ప్యాకెట్లతో ప్రచారంలో పాల్గొంటున్న వారికి అందించి సంతృప్తి పరుస్తున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు ప్రచారం సాగే ప్రాంతాల్లో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ రెండు చేతులా ఆర్జిస్తున్నారు.

ఎంజీఆర్ ఎదుర్కొన్న తిరుప్పూర్ కేసు

ప్యారీస్, ఏప్రిల్ 2: అన్నాడీఎంకే వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ తిరుప్పూర్ బహిరంగ సభలో ప్రసంగించారని నమోదైన కేసును రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. డీఎంకే నుంచి వైదొలగినప్పటి నుంచి అధికారంలో వచ్చేంతవరకు ఎంజీఆర్ అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొన్నారు. వాటిలో తిరుప్పూర్ బహిరంగ సభలో పాల్గొన్నందుకు ఆయనపై నమోదైన కేసు ఒకటి. 1972లో జరిగిన అన్నాడీఎంకే బహిరంగ సభలో పాల్గొన్న ఎంజీఆర్, డీఎంకే ఎమ్మెల్యేలు అక్రమార్జనకు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. అప్పటి డీఎంకే ఎమ్మెల్యే దురైస్వామి ఎంజీఆర్‌పై పరువు నష్టం దావా వేశారు. విచారణ నిమిత్తం రెండు సార్లు ఎంజీఆర్ తిరుప్పూర్ కోర్టుకు వెళ్లారు. ఎంజీఆర్ వస్తున్న సమాచారం తెలిసి తిరుప్పూర్ నగరంలో ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో గుమిగూడారు. కాగా, కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం, ఎంజీఆర్ డీఎంకే ఎమ్మెల్యేలపై చేసిన ఆరోపణలపై సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలంటూ పోలీసులకు ఉత్తర్వులు జారీచేసింది. పలు రాజకీయపార్టీల నేతలపై వందల సంఖ్యలో కేసులు నమోదై ఉన్న నేపథ్యంలో, ఎంజీఆర్ తిరుప్పూర్ కేసు మాత్రమే నమోదు చేయడం గమనార్హం.

ఎన్నికల బరిలో 68 పార్టీలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 2: ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రాష్ట్రంలో 68 పార్టీలు సిద్ధమయ్యాయి. ఈ పార్టీలన్నీ రిజిస్టర్ చేయించుకున్నవి కాగా, ఎన్నికల గుర్తింపు పొందిన పార్టీలు మాత్రం కొన్నే. కాగా ఈ మొత్తం పార్టీల నుంచి 950 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, ఇందులో 874 మంది పురుషులు, 76 మంది మహిళలున్నారు. అత్యధికంగా కరూర్ నియోజకవర్గం నుంచి 54 మంది, అత్యల్పంగా నాగపట్టినం నియోజకవర్గం నుంచి 9 మంది వున్నారు. మొత్తం అభ్యర్థుల్లో 609 మంది స్వతంత్రులు కావడం విశేషం.




'నెవర్ ఎస్కేప్' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

విడుదలకు సిద్ధమైన 'నెవర్ ఎస్కేప్'

● ఆడియో, ట్రైలర్ రిలీజ్

రాయల్ బి ప్రొడక్షన్స్ పతాకంపై నాన్సీ ఫ్లోరా నిర్మాణంలో శ్రీ అరవింద్ దేవ్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నెవర్ ఎస్కేప్'. రాబర్ట్ మాస్టర్, ఆది పృథ్వీ, హర్షిణి, కవి జె.సుందరం, ఉసైని ఖాన్, రాజి, అఖిల సుందర్, జెబిన్ జాన్, ప్రాణేశ్వర్ తదితరులు నటించారు. సంగీతం చరణ్‌కుమార్. త్వరలోనే విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను సోమవారం చెన్నైలో విడుదల చేశారు. నిర్మాత ఆల్బర్ట్ మాట్లాడుతూ... 'చిత్రపరిశ్రమకు ఇప్పుడే పరిచయమవుతున్నా. ఈ సినిమా ప్రారంభించే సమయంలో మా అందరి వయసు 25 యేళ్లు. కానీ, 50 యేళ్ల అనుభవం ఉన్నవారిలా ఈ ప్రాజెక్టు కోసం పనిచేశాం. ఈ సినిమాను దర్శకుడు వైవిధ్యభరితంగా రూపొందించారు. రాబర్ట్ మాస్టర్ బాగా నటించారు. హారర్, సైకో, మిస్టరీ ఈ మూడు అంశాలు కలిసి ఉంటుంది' అని పేర్కొన్నారు. దర్శకుడు అరవింద్ రాజ్ మాట్లాడుతూ... 'దర్శకుడిగా నాకు తొలిచిత్రం. నిర్మాతకు రుణపడి ఉంటా. స్క్రిప్టు సిద్ధం చేసుకుని అనేక మందిని సంప్రదించా. చివరకు రాబర్ట్ ముందుకు వచ్చారు. గతంలో వచ్చిన చిత్రాలకంటే భిన్నంగా ఉంటుంది' అని వివరించారు. హీరో రాబర్ట్ మాస్టర్ మాట్లాడుతూ... 'కథ విన్న తర్వాత డైరెక్టర్ ఎవరని అడిగా. ఎందుకంటే అరవింద్ నాకు దర్శకుడిగా కనిపించలేదు. స్టోరీ ఎంతగానో నచ్చింది. కొన్ని సన్నివేశాల్లో గుండు చేయించుకోవాలని సూచించారు. అప్పటికే ఒక చిత్రంలో కమిట్ కావడంతో ఆ చిత్ర దర్శకుడి వద్ద పర్మిషన్ తీసుకుని గుండు చేసుకున్నారు. మంచి జట్టుతో పనిచేశా. ఇందులో నన్ను వైవిధ్యభరితమైన పాత్రలో చూస్తారు. కొన్ని హాలీవుడ్ చిత్రాలకు దీటుగా హర్రర్ మిస్టరీ కలిసిన మూవీగా 'నెవర్ ఎస్కేప్' ఉంటుంది' అన్నారు. అలాగే, నటి హర్షిణి, నటుడు ఉసైన్ ఖాన్, నటుడు పృథ్వీ, సంగీత దర్శకుడు చరణ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.